

# కొత్త వెలుగు

-కె.బి.కృష్ణ

"మరి రెండురోజుల్లో జనవరి ఫస్ట్ వస్తుంది కదా. మనం మన బాస్ దగ్గరకు ఆ రోజు ప్రొద్దునే వెళ్లాలికదా. ఏం చేద్దాం, ఎలా చేద్దాం?'' అంటున్నారు ఆఫీసు సూపరింటెండెంట్.

బ్రిటిష్‌వాడు మనల్ని శాశ్వతంగా వదిలి వెళ్లిపోయేముందు మనకు వదిలిన, అంటించిన, బెడ్ కాఫీ, టీ, ప్యాంటూ షర్టు, సూటూ బూటుతోపాటు జనవరి ఫస్టున హేపీ న్యూఇయర్ చెప్పడం కూడా ఒకటి. అసలు తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకోకుండా మనం ఉగాది పచ్చడి తినడంతోనే ఉగాది జరుపుకోడవం జరిగిపోతుంది.

"మీరు ఎలా చెప్తే అలా చేద్దాం సార్'' అన్నాడు ఆయన దగ్గర సహాయకుడిగా పని చేసే చిన్న గుమాస్తా. ఇంతలో బాస్‌కి అతి సన్నిహితుడైన ఒక అటెండర్ ఆయన ఇంటి నుండి వచ్చారు.

"సూపర్నెంటుగారూ! అయ్యగారు మీకు ఒక విషయం చెప్పమన్నారండీ. మన ఆఫీసోళ్లకీ, మన క్రింద ఆఫీసుల్లో పనిచేసే సిబ్బందికి కూడా ఈ కబురు చెప్పమన్నారండీ'' అన్నాడు.

"ఏమిటోయ్ విశేషం? కొత్త సంవత్సరంలో యాపిల్స్, గ్రీటింగ్ కార్డులు, బొకేలు కాకుండా ఇంకా ఏమైనా ఎక్స్‌ట్రాగా తీసుకెళ్లాలా ఏమిటి?'' అన్నారు సిబ్బంది అంతా.

"అదికాదండయ్యా! అయ్యగారు చెప్పిందేమిటంటే మన ఆఫీసోళ్లంతా గ్రీటింగ్ కార్డులు, యాపిల్స్, పూల బొకేలకు బోలెడు డబ్బు ఖర్చు పెడుతున్నారు. ఈ సంవత్సరం జనవరి ఫస్టుకి మా ఇంటికి వచ్చినవాళ్లందరూ తాము వాటికి ఖర్చు పెట్టే డబ్బు, నేను హాలులో ఒక డబ్బా పెడతాను. అందులో వేయమని చెప్పారు. ఆ డబ్బులతో నేను అనాధలకు అన్నదానం చేయాలనుకుంటున్నాను అన్నారండయ్యా'' అన్నాడు అటెండర్.

అందరి ముఖాలు అదోలా అయిపోయాయి. చివరకు ఒకతను "నా ముఖం. ఆ డబ్బుతో మన బాస్ ఏదో ఒక మంచి గిఫ్ట్ కొనేసుకుంటాడు. అంతేగానీ అన్నదానం చేస్తాడా నా ముఖం'' అన్నాడు.

వెంటనే అటెండర్ అతనివేపు కోపంగా చూసి "వేసవికాలంలో అయ్యగారు ట్రాన్స్‌ఫర్ చేస్తానన్నారు గుర్తుంచుకోండి'' అన్నాడు.

అంతే... అతని నోరు మూతబడింది.

సూపరింటెండెంట్ కలుగచేసుకుని "తప్పు మనం అలా అనకూడదు. మనం ఎప్పుడూ ఖర్చు పెట్టేదానికన్నా ఎక్కువ మొత్తమే బాస్‌కి ఇద్దాం. చూద్దాం ఏం జరుగుతుందో?''

***

జనవరి ఫస్ట్ వచ్చింది.

సిబ్బంది అందరూ బాస్ చెప్పినట్లే ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి ఆయన ఇచ్చిన ఫలహారాలు తిని హాలులో ఏర్పాటు చేసిన డబ్బాలో డబ్బులు వేసారు.

***

ఒక వారంరోజుల తరువాత మళ్లీ తన సిబ్బంది అందరినీ తన ఇంటికి ఆహ్వానించాడు. బాస్ ఇంటి దగ్గర షామియానాలు, బల్లలు, కుర్చీలు ఏర్పాటు చేసారు.

వంటలు తయారయ్యాయి. సుమారు ఐదు వందలమంది పిల్లలను అనాధ శరణాలయాల నుండి బస్సుల్లో రప్పించి అన్నదానం చేసారాయన. ఈ సత్కార్యంలో సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

"మన బాస్ చెప్పింది ఎంతో బాగుంది. ఇక నుండి నూతన సంవత్సర వేడుకలు ఇలాగే చేసుకుందాం'' అనుకుంటున్నారు అందరూ.

బాస్ పేరు పేరున అందరికీ కృతజ్ఞతలు చెప్పారు తన ఆలోచనను కార్యరూపంలో పెట్టడానికి సహకరించిన సిబ్బంది అందరికీ. అప్పుడు ఆయన ముఖంలో తృప్తితో నిండిన కాంతి గోచరించింది.

★